

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## బావా మరదళ్ళు

**ఓ మూలనించి** గలగల నవ్వులు వినపడటంతో విడిదింట్లోకి వచ్చిన హరి అనాలోచితంగా అటువైపు చూసాడు. అతని కజిన్స్ అందరూ అక్కడున్న ఓ అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరిలోకి ప్రత్యేకంగా కనిపిస్తోంది స్వాతి. తెల్లచీరకి నల్లరంగు బార్డర్. మిలమిల మెరిసే నల్లటి స్లీవ్‌లెస్ జాకెట్. మేచింగ్ అలంకరణలు. ఏదో విషయాన్ని అభినయంతో చెప్తోంది. అంతా ఆసక్తిగా వింటున్నారు.

'షోకులాడి. మొగుడు వదిలేసినా దీనికి సిగ్గులేదు' గొణుక్కున్నాడు.

"ఒరే హరీ ఇటు. ఇక్కడికిరా" ఆ గుంపులోని ఒక కజిన్ పిలిచాడు. అప్రయత్నంగా హరి అటువైపు నడిచాడు. నవ్వుతూ ఏదో చెప్తున్న స్వాతి అతన్ని చూడగానే మౌనంగా అక్కడినించి వెళ్ళిపోయింది. ఆడపిల్లలు ఆమె వెంట వెళ్తే, మగవాళ్ళు కబుర్లలో పడ్డారు.

హరికి చిరాగ్గా ఉంది. 'ఈ పెళ్ళికి రాను' అంటే రమ్మని బలవంతం చేసిన పిన్నికొడుకు మీద, 'అందర్నీ చూసినట్లుంటుంది రారా' అని చంపుకుతిన్న తల్లిమీద పీకలదాకా కోపంగా వుంది.

'ఈ దెయ్యం వస్తుందనుకుంటే వచ్చేవాడ్ని కాదు' వందోసారి అనుకున్నాడు. కళ్యాణమండపం పక్కనే ఉన్న ఎనిమిది గదులని విడిదిగా ఇచ్చారు. సామాను గదుల్లో పెట్టినా, అంతా ఆ ఆవరణలోనే తిరుగుతూ బృందాలుగా విడిపోయి కబుర్లు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారు. దాంతో హరికి ఏదో ఓ పక్క స్వాతి కనిపిస్తూనే ఉంది. అదే ఉత్సాహం, అదే హుషారు, అదే చలాకీతనం! పైగా, పదే పదే చూడాలనిపించే అందం.

బయటకి వెళ్దామన్నా ఆ ఊరు ఏమీ తెలీదు. ఎక్కడికి వెళ్ళాలో కూడా తోచలేదు. 'మూడురోజులు పెళ్ళి చేసుకుంటా' అన్న పెళ్ళికొడుకుని మనసులోనే తిట్టుకున్నాడు.

భోజనాల దగ్గర రెండో పంక్తిలో కూర్చుని స్వాతిని తప్పించుకున్నాడు. ఆమె ఉనికే అతనికి భరించరానిదిగా ఉంది. ముఖ్యంగా ఆమె నవ్వు.

"స్వాతీ! నీకు అన్యాయం చేసానమ్మ. నా మూలంగా నీ జీవితం నాశనమైపోయింది" తల్లి ఏడుపు గొంతు విన్న హరి మంచం మీంచి ఉదుటున లేచి బయటకి వచ్చాడు.

"ఊరుకో అత్తా! ఇందులో నువ్వు చేసిందేముంది?" స్వాతి ఆవిడని పొదవి పట్టుకుని ఓదార్చుతోంది.

"మేనకోడలు కోడలైతే ముసలితనంలో బాగా చూసుకుంటుందని ఆశపడ్డాను. ఆ దేవుడు కరుణించలా! మీ నాన్నకి మొహం చూపించడానికి కూడా సిగ్గుగా వుంది. ఆ దౌర్భాగ్యుడు ఇలా చేస్తాడనుకుంటే, ఈ పెళ్ళి చేయకపోదును." ఆవిడ పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

"పెళ్ళింట్లో ఏడిస్తే వాళ్ళు ఏమైనా అనుకుంటారత్తా. రా. మన రూంలోకి వెళ్దాం" స్వాతి ఆవిడని ఓ చేత్తో, ఆవిడ సూట్ కేస్‌ని మరో చేత్తో పట్టుకుని ఓ మూలగా వున్న గదికి తీసుకెళ్ళింది.

కన్న తల్లిని కూడా శత్రువుని చేసిన స్వాతి మీద హరికి ఇంకాస్త కోపం పెరిగింది.

స్వాతి, హరి చిన్నప్పటినించి కలిసి మెలిసి ఆడుకునేవారు. ఒకరిమీద మరొకరు ఇష్టంగా ఉండేవాళ్ళు. ముఖ్యంగా పెద్దయ్యేకొద్దీ స్వాతి అందం చలాకీతనం హరిని విపరీతంగా ఆకర్షించాయి. తల్లి 'ఏరా స్వాతిని పెళ్ళి చేసుకుంటావా? మా అన్నయ్యని అడగనా?' అన్నప్పుడు 'సరే' అన్నట్లు తలని గుండ్రంగా తిప్పాడు. ఆవిడ ఓ శుభముహూర్తంలో పుట్టింటికి వెళ్ళి, అన్నా వదినలని ఒప్పించి వారి నించి హామీ తీసుకుని దిగ్విజయంగా వెనక్కి వచ్చింది. స్వాతికి కూడా హరిని కాదనడానికి కారణం కనపడలేదు.

స్వాతి చదువులోకూడా చురుకే. ఆరు గోల్డ్ మెడల్స్‌తో ఇంజనీరింగ్ పూర్తి చేసి మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. హరి ఫస్ట్‌క్లాస్‌లో పాసై తనూ ఓ ఉద్యోగంలో చేరాడు. పెళ్ళయ్యాక ఇద్దరి ఆఫీసులకి దగ్గరగా ఉన్న ఓ త్రిబుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌ని అద్దెకి తీసుకుని కాపురం పెట్టారు.

పెళ్ళికి ముందు స్వాతిలో ఏ లక్షణాలు ఆకర్షించాయో, పెళ్ళయ్యాక ఆ లక్షణాలని హరి భరించలేకపోయాడు. కలుపుగోలుగా ఉండే స్వాతికి ఆడ, మగ తేడా లేకుండా ఓ పెద్ద మిత్రబృందం ఉంది. పెళ్ళికి ముందు వాళ్ళని చూసి, స్వాతి సోషల్ పర్సన్, అందరితో ఎంత బాగా ఉంటుందో అనుకున్నవాడు, పెళ్ళయ్యాక ఆ బృందాన్ని చూస్తే అసహనంగా ఉండేవాడు. హరికి ఉన్న ఒకరిద్దరు స్నేహితులు కూడా స్వాతి ఫ్రండ్స్ అయిపోయారు.

"వాళ్ళందరితో అంత క్లోజ్‌గా తిరుగుతావేంటి? ఆ నవ్వులేంటి? నాకు నచ్చలేదు" పెళ్ళయిన మూడు నెలలకి స్వాతితో చెప్పాడు.

ఆ మాటలకి స్వాతి దిగ్భ్రాంతి చెందింది.

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నా వా బావా? మొన్నటిదాకా నువ్వూ మాతో కలిసి మెలిసి ఉన్నవాడివేగా?" తీవ్రంగా అడిగింది.

"వాళ్ళని మనింటికి రావద్దని చెప్పు. ఇప్పుడు నాకు వాళ్ళు ఇష్టంలేదు." చెప్పాడు.

స్వాతి ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం ఏడుగంటల తర్వాత ఇంటికి వచ్చిన స్వాతిని అడిగాడు.

"ఇంతలేట్టైందే?"

"మన ఫ్రెండ్స్‌ని ఇంటికి రానివ్వద్దన్నావుగా? వాళ్ళతో బయటే స్పెండ్ చేసి వచ్చా" చెప్పింది.

కోపంతో హరి మొహం ఎర్రబడింది.

"వాళ్ళని రానివ్వద్దంటే వదిలివెయ్యమని అర్థం. బయట బలాదూర్ తిరగమని కాదు" కటువుగా చెప్పాడు.

హరికి నచ్చని మరో అంశం స్వాతి డ్రెస్సింగ్. స్వతహాగా ఫేషన్స్ ఇష్టపడే స్వాతి రకరకాల డ్రస్‌లు అనేక రకాల హెయిర్ స్టైల్స్, మేకప్‌తో ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా ఉంటుంది. పదిమందిలో ఉన్నా ఆమె ఆకర్షణీయంగా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

"నీకు పెళ్ళయిందిగా? ఇంకా ఈ షోకులెందుకు?" ఓ రోజు అడిగాడు. స్వాతి గలగలా నవ్వి అడిగింది.

"పెళ్ళయితే గాలి కూడా పీల్చకూడదన్నట్లు చెప్పావు బావా"

"నువ్వు అందరికీ అందంగా కనిపించడం నాకిష్టంలేదు."

"నేను నేచురల్ బ్యూటీని బావా. పొద్దున్నే నిద్రమొహంతో అద్దం చూసుకుంటే నాకు నేనే ముద్దొస్తాను తెలుసా"

"నేచురల్ బ్యూటీకి ఈ మేకప్పులెందుకో?" వెటకారంగా అడిగాడు.

"నా కిష్టం బావా. చిన్నప్పుడు పాండ్స్ పౌడర్ తెల్లగా పూసుకుని, కళ్ళకి వెడల్పుగా కాటుక పెట్టుకునే దాన్నిట. ఆ ఇష్టం నాతో పాటే పెరిగి పెద్దదైంది. లిప్ స్టిక్, ఐ లైనర్ లేకుండా బతకలేను" అతని మెడచుట్టూ చేతులు వేసి చెప్పింది.

ఆమెని దూరంగా తోసి అడిగాడు.

"చీరలో, పంజాబీ డ్రెస్‌లో వేసుకోవచ్చుగా? ఆ గౌన్లు, స్కర్ట్‌లు ఏమిటి పెళ్ళయినదానికి?"

స్వాతికి కోపం వచ్చింది.

"ఏంటి బావా. మాట్లాడితే పెళ్ళయినదానివి అంటావు. పెళ్ళయితే ఇక జీవితం అయిపోయినట్లేనా? పెళ్ళవగానే నా ఫ్రెండ్స్‌ని, నా ఇష్టాలని అన్నీ వదులుకోవాలా?"

"నేను కావాలనుకుంటే వదులుకోవాలి" కఠినంగా చెప్పాడు.

స్వాతి దెబ్బతిన్నట్లు చూసింది.

ఆ రోజునించి వారి పడకలు వేరయ్యాయి. స్వాతి ఇంటిపనులు, వంట పనులు యధాప్రకారం చేసి, అందంగా తయారై ఆఫీస్‌కి వెళ్తోంది. హరి మౌనంగా తింటున్నాడు. ఆఫీస్‌కి వెళ్ళొస్తున్నాడు.

ఓ వారం తర్వాత తల్లికి ఫోన్ చేసాడు.

"అమ్మా! నువ్వూ నాన్నా ఓసారి అర్జెంట్‌గా రండి."

"ఏమైందిరా?" ఆవిడ కంగారు పడింది.

"నువ్వురా. చెప్తాను."

మర్నాడు పొద్దున వారు వచ్చేసరికి స్వాతి ఆఫీస్‌కి వెళ్ళిపోయింది. హరి సెలవు పెట్టాడు స్నానాలయ్యాక తండ్రి అడిగాడు.

"ఏంట్రా అర్జెంట్‌గా రమ్మన్నావు?"

"నేను స్వాతికి విడాకులిచ్చేద్దాం అనుకుంటున్నా నాన్నా." నిర్భయంగా చెప్పాడు. తక్షణం అతని చెంప ఛెళ్ళుమంది.

"ఏం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?" ఆయన గర్జించాడు. తల్లి ఏడుపు లంకించుకుంది.

"నీ కీదేం పోయేకాలం రా అబ్బాయ్?"

"నేను దాంతో వేగలేనమ్మా" చెంప తడుముకుంటూ చెప్పాడు.

"ఏం చేసింది? నీకు రోజూ కూడు వండి పెట్టడం లేదా?" తండ్రి అడిగాడు. "వండుతుంది."

"మరి ఇల్లు శుభ్రంగా ఉంచడం లేదా?" చుట్టూ చూస్తూ అడిగింది తల్లి. ఇల్లు అద్దంలా ఉంది.

తల అడ్డంగా ఊపాడు.

"అదికాదు"

"మరి ఉద్యోగం చేస్తున్నాను. సమాన హక్కులుండాలి అంటుందా?"

మళ్ళీ తలని అడ్డంగా ఊపాడు.

"మరి ఏం మాయరోగం?" తండ్రి అరిచాడు.

"దాని షోకులు నాకు నచ్చట్లేదు."

"షోకులా?" వాళ్ళు నోరు తెరిచి చూస్తూండిపోయారు.

"అవును. దాని చిట్టిపొట్టి డ్రెస్‌లు, మేకప్పులు భరించలేకపోతున్నా. వద్దన్నా వినడంలేదు."

"అదేం వేసుకున్నా ముద్దుగా ఉంటుంది. పిచ్చి వెధవా? అంత చిన్న కారణానికి బంగారు తల్లికి విడాకులిస్తానంటావా?" తల్లి అరిచింది.

"మీరేమైనా చెప్పండి. నా మనసు విరిగిపోయింది. నేను దానితో కలిసి కాపురం చేయలేను. నా మాటే ఫైనల్." హరి బయటకి వెళ్ళిపోయాడు.

"వీడికిదేం పాడు బుద్ధండీ? మా అన్నా వదినకి ఏం చెప్పాలి?" ఆవిడ కుమిలిపోయింది.

ఆయన తల పట్టుకుని కూర్చున్నాడు.

సాయంత్రం ఇంటికి వచ్చి, వాళ్ళని చూసిన స్వాతి సంతోషంగా వచ్చి అత్తని కౌగిలించుకుంటూ చెప్పింది.

"అత్తా! ఎప్పుడొచ్చారు? బావున్నావా మామయ్యా? ముందే చెపితే వంటచేసి వెళ్ళేదాన్నిగా? ఏమైనా తిన్నారా? అత్తా నువ్వే వంట చేసావా? రాత్రికి నేను చేస్తా కాని మీరు హేపీగా టి.వి చూసుకోండి"

ఆవిడ భోరుమంది. స్వాతి కంగారు పడింది.

"ఏమైందత్తా. ఏదైనా హెల్త్ ప్రాబ్లమా?"

ఆవిడ జవాబు చెప్పకుండా ఏడవసాగింది.

"నువ్వన్నా చెప్పు మామయ్యా. నాకు చాలా భయంగా ఉంది. అసలు బావేడి? మిమ్మల్నిద్దర్నీ వదిలేసి ఎక్కడికి వెళ్ళాడు?" స్వాతి కంగారుగా అడిగింది.

"ఆ త్రాష్టుడు నీకు విడాకులిస్తాడటమ్మా" ఆయన ఆవేదనగా చెప్పాడు.

"ఏమిటి?" స్వాతి స్థాణువైంది.

"డ్రెస్సింగ్ విషయంలో నువ్వు వాడి మాట వినడంలేదుట"

"అంత చిన్న విషయానికి కూడా విడాకులు తీసుకుంటారా మామయ్యా?" కోపంగా అడిగింది.

"నువ్వయినా సర్దుకుపోవచ్చుకదమ్మా?" ఆయన అనునయంగా అడిగాడు.

స్వాతి ఉక్రోషంగా చూసింది.

"నా ఫ్రెండ్స్ నచ్చలేదు. నా దుస్తులు నచ్చలేదు. అందుకని విడాకులు. ఇప్పుడు కాంప్రమైజ్ అయితే రేపు ఇంకోటి నచ్చదు. ఆ మర్నాడు మరోటి నచ్చదు. ఏంటి మామయ్యా ఇది. విడాకులని బ్లాక్ మెయిల్ చేయడం ఏంటి? పెద్దవాళ్ళు మీరు. మిమ్మల్ని ఉన్నట్లుండి పిలిపించడం ఏమిటి? సారీ మామయ్యా. విడాకులు నాకూ ఇష్టమేనని మీ కొడుక్కి చెప్పండి."

స్వాతి ఓ గంటలో తన సామాను సర్దుకుని వెళ్ళిపోయింది. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన హరి ఆ విషయం తెలిసి కోపంతో చిందులేసాడు.

"చూసారా? విడాకులైనా ఇస్తుంది కానీ అలవాట్లు మార్చుకోదన్నమాట. అలాంటిదాన్ని వదిలేయడమే కరెక్ట్"

ఆరు నెలల తర్వాత హరి మళ్ళీ ఇప్పుడే స్వాతిని చూస్తున్నాడు. తను వదిలేసాడని ఏమాత్రం దిగులు పడకుండా హుషారుగా ఉండటం అతనికి రుచించడంలేదు. మొహం చెల్లక అసలు ఆ పెళ్ళికి రాదనుకున్నాడు. వచ్చినా అవమానంతో, సిగ్గుతో ఓ మూల పడివుంటుందనుకున్నాడు. కానీ ఆమె ఎప్పట్లా చురుగ్గా, అందరితో కలివిడిగా ఉండటం, అందంగా తయారవడం హరి భరించలేకపోతున్నాడు. బంధువులంతా స్వాతిలాంటి అమ్మాయిని వద్దనుకున్న వీడు ఎంత ఫూల్ అన్నట్లుగా చూస్తున్నారని అతనికి అనుమానంగా ఉంది. మేనమామ కనిపించినా మాట్లాడలేదు.

సంగీత్‌లో ఆకుపచ్చ డ్రెస్‌లో స్వాతి మెరిసిపోయింది. ఆమె వేసే స్టెప్స్‌కి కజిన్స్ చప్పట్లు కొట్టి ఎంకరేజ్ చేయసాగారు. హరి విసురుగా లేచి బయటకి వెళ్ళిపోయాడు. వెనకనించి నవ్వులు, అరుపులు అతన్ని వెక్కిరిస్తున్నట్లుగా వినిపిస్తూనే ఉన్నాయి.

ఆ రాత్రి హరికి నిద్రపట్టలేదు. విడాకులని బెదిరిస్తే, స్వాతి దారికి వస్తుందనుకున్నాడు కానీ అలా ధిక్కరించి వెళ్ళిపోతుందనుకోలేదు. స్వాతి స్పర్శ ఆమె చిలిపి చేష్టలు, ఆమె అల్లరి అతనికి పదేపదే గుర్తొస్తూంటే ఆ రాత్రంతా అశాంతిగా గడిచింది.

మర్నాడు ఓ గదిలో బంధువులు పంచాయితీ పెట్టారు. హరి, స్వాతి తమ తమ పంతాలు మాని మళ్ళీ కలిసి కాపురం చేయాలని తీర్మానించారు. పెద్దల చర్చలు ముగిసాక వాళ్ళిద్దర్నీ రమ్మని కబురు చేసారు.

"చూడ్రా హరీ పెళ్ళంటే నూరేళ్ళ పంట. గౌన్లు, పంజాబీ డ్రెస్‌ల కోసం కాపురాన్ని కాలదన్నుకుంటే ఇక పెళ్ళికి విలువేంటి?" పెద్ద మామయ్య పెద్దరికంగా చెప్పాడు.

"దాన్ని చూసారుగా మామయ్యా! మొగుడు వదిలేసినా ఆ షోకులు, నవ్వులూ.." హరి ఉక్రోషంగా అరిచాడు.

"పెదనాన్నా. అతన్ని నోరు అదుపులో పెట్టుకోమని చెప్పు" స్వాతి శాంతంగా చెప్పింది.

"ఒరేయ్! ఏం మాటలా అవి? బుద్ధిలేదూ?" హరి తండ్రి అరిచాడు.

"అది తప్పయిందని ఒప్పుకుని బుద్ధిగా ఉంటే నాకు ఓకే" ఇంకా సాగదీస్తే మొదటికే మోసం వస్తుందనుకున్న హరి చెప్పాడు.

"నాకిష్టంలేదు" స్వాతి చెప్పింది.

"అదేంటమ్మా వాడు ఒప్పుకున్నాడుగా?" బాబాయ్ అడిగాడు.

"వాడు ఒప్పుకుంటే చాలా బాబాయ్!"

"నీది మరీ మొండితనమే తల్లీ" పిన్ని విసుక్కుంది.

"చుట్టాల్లో వాళ్ళని పెళ్ళిచేసుకోకూడదు పిన్ని. బుద్దిలేకుండా చేసుకున్నాను. బావకి నేనంటే చిన్నప్పుడు వర్షిప్. నా తెలివితేటలంటే ఆరాధన. నాకు గోల్డ్ మెడల్స్ వచ్చినప్పుడు, మంచి జాబ్ వచ్చినప్పుడు నాకంటే ఎక్కువగా సంతోషించాడు. నేను పెళ్ళాం అవగానే ఆ

గొప్పదనాలు బావకి చిన్నతనంగా అనిపించింది. తన కంపెనీకంటే నాది మంచిది. మా ఇద్దరిలో నాకు జీతం ఎక్కువ. నేను అందరితో ఫ్రెండ్లీగా ఉంటాను. ఇవన్నీ బావ జీర్ణించుకోలేకపోయాడు. సిల్లీ కారణాలు చెప్పి విడాకులు అడిగాడు. ఎందుకంటే, తను వెదికినా నాలో లోపాలు లేవు. ఈ పెళ్ళి వల్ల నేను నన్ను ప్రోత్సహించిన బావని పోగొట్టుకున్నాను. ఇంక బావని భర్తగా భరించే ఓపిక నాకు లేదు. పెళ్ళయిన ఏడాది తర్వాత కానీ విడాకులు మంజూరు చేయరట. ఇంకో ఆర్నెల్లలో నేను మళ్ళీ బావకి మరదల్ని అవుతా. మళ్ళీ మేం పూర్వంలాగే ఉంటామేమో? బావా! ప్రమోషన్ లిస్ట్‌లో నా పేరుంది. నాకే రావాలని ఆల్ ది బెస్ట్ చెప్పు" స్వాతి షేక్ హాండ్ కోసం చేతిని చాపుతూ హరితో నవ్వుతూ చెప్పింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments